క్లుప్తంగా

రేపు ఉచిత వైద్య శిబిరం

ఆల్విన్‌కాలనీ: బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు జన్మదినం పురస్కరించుకొని అమోర్ హాస్పిటల్ సౌజన్యంతో ఉచిత ఆరోగ్య, రక్తదాన శిబిరాన్ని నిర్వహించనున్నారు. శనివారం ఉదయం 9 గంటలకు వివేకానందనగర్, ప్లాట్ నెంబర్ 621లో ఈ శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. పరిసర ప్రాంత ప్రజలు పాల్గొని శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఔత్సాహిక రక్తదాతలు పాల్గొని రక్తదానం చేయాలని కోరారు.

సీసీ రోడ్డును పరిశీలించిన కార్పొరేటర్



బాలానగర్: ఫతేనగర్ డివిజన్ పరిధిలోని జవహర్‌నగర్ కాలనీలో సీసీ రోడ్డును ఏఈ రాధాకృష్ణ, స్థానిక సంక్షేమ సంఘం ప్రతినిధులతో కలిసి గురువారం కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ పరిశీలించారు. కాలనీ వాసులు కార్పొరేటర్‌ను సన్మానించారు. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సహకారంతో రూ.15 లక్షలతో సీసీ రోడ్డు వేసినట్లు కార్పొరేటర్ తెలిపారు. కార్యక్రమంలో కె. రాము ముదిరాజ్, వెంకటేష్, శ్రీనివాస్, జితేందర్, కీర్తి, ఉమారాణి, చిట్టి, జయమ్మ, ఉమా, డి. భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఈడీ ఆఫీస్ ముట్టడికి తరలిన నాయకులు



కూకట్‌పల్లి: కాంగ్రెస్ ఆధ్వర్యంలో గురువారం నాంపల్లిలోని ఈడీ ఆఫీస్ ముట్టడికి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు గురువారం తరలివెళ్లారు. మోదీ డౌన్‌డౌన్, ఈడీ డౌన్‌డౌన్, అమిత్ షా డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్, టీపీసీసీ అధికార ప్రతినిధి సత్యం శ్రీరంగం, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు శేరి సతీష్ రెడ్డి, ఏ బ్లాక్ అధ్యక్షులు నాగిరెడ్డి, బీ బ్లాక్ అధ్యక్షులు తూము వేణు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్యాచ్ వర్కు పనులు పూర్తి చేయాలి



కార్పొరేటర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాలనీ వాసులు

ఆల్విన్‌కాలనీ: వెంకటపాపయ్య నగర్‌లోని రోడ్డు నెంబర్ 1లో సీసీ రోడ్డు ప్యాచ్ వర్కు పనులు పూర్తి చేసి పునరుద్ధరించాలని కాలనీ వాసులు కోరారు. ఈ మేరకు కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. సంబంధిత అధికారులతో మాట్లాడి పనులు పూర్తి చేస్తామని కార్పొరేటర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సమ్మారెడ్డి, జూపల్లి జనార్దన్‌రావు, జీవన్‌రెడ్డి, షౌకత్‌అలీ, మున్నా తదితరులు పాల్గొన్నారు.

నల్లాకు బిగించిన మోటార్లు స్వాధీనం



మోతీనగర్: వేసవికాలం మంచినీరు లో ప్రెషర్ కారణంగా నీటి సరఫరా అయ్యే నల్లాకు మోటార్లు బిగిస్తున్నారు. దీంతో కొన్ని రోజుల నుంచి అధికారులు ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. అల్లాపూర్ డివిజన్ గాయత్రినగర్‌లో గురువారం అల్లాపూర్ జలమండలి సెక్షన్ పర్యవేక్షణలో తనిఖీలు చేపట్టి 8 మోటార్లను స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా మోటార్లు బిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో జలమండలి మూసాపేట సర్కిల్ డీజీఎం శివ, అల్లాపూర్ జలమండలి సెక్షన్ మేనేజర్ అన్విత్ తదితరులు పాల్గొన్నారు.

భూ భారతితో వివాదాలకు శాశ్వత పరిష్కారం



సమావేశంలో మాట్లాడుతున్న మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్

మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్

సాక్షి, సిటీ బ్యూరో: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన భూ భారతి, నూతన ఆర్‌ఓఆర్ చట్టం ద్వారా భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని, మేడ్చల్- మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ అన్నారు. గురువారం మేడ్చల్ కలెక్టరేట్ మీటింగ్ హాల్‌లో భూభారతి నూతన ఆర్‌ఓఆర్ చట్టంపై తహసీల్దార్లు, జిల్లా రెవెన్యూ అధికారులకు అవగాహన కల్పించేందుకు అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డితో కలిసి కలెక్టర్ సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ.. భూభారతి ఆర్‌ఓఆర్ చట్టంలోని అన్ని అంశాలను క్షుణ్ణంగా చదివి పూర్తి అవగాహన చేసుకోవాలన్నారు.

◆ 1989 ఆర్‌ఓఆర్ చట్టంలోని అంశాలు భూభారతిలోని అంశాలు కొంత వరకు సిమిలర్గా ఉన్నాయన్నారు. రెవెన్యూ అధికారులకు ధరణిలో లేని అధికారాలు భూభారతిలో ఉన్నాయని, ఈ అధికారాలతో రెవెన్యూ అధికారులపై బాధ్యత మరింత పెరిగిందన్నారు.

◆ ప్రతీది ఆన్‌లైన్ ద్వారా డిజిటల్ రికార్డులను నిర్వహించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. రెవెన్యూ అధికారులకు పూర్తిస్థాయి అధికారాలు వచ్చే వరకు ప్రొసీడింగ్స్ ద్వారా మాన్యువల్‌గా నిర్వహించాలన్నారు.

◆ నూతన మార్గదర్శకాలతో సమ్మతించడం, తిరస్కరించడం చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రభుత్వం అనేక కొత్త అంశాలను పొందుపరుస్తూ ఈ నూతన ఆర్‌ఓఆర్ చట్టాన్ని తెచ్చిందన్నారు.

◆ ధరణి స్థానంలో కొత్తగా భూ భారతి వ్యవస్థను అమలు చేస్తున్నట్లు తెలిపారు. భూ భారతి 2025 చట్టంలో 23 సెక్షన్లు, 18 నిబంధనలు ఉన్నాయని, ప్రభుత్వం ఆధార్ తరహాలో భవిష్యత్తులో భూమికి సంబంధించి సర్వేచేసి కొలతలు, హద్దుల వంటి సమగ్రమైన వివరాలతో ‘భూధార్’ తీసుకురాబోతుందని పేర్కొన్నారు. ఈ చట్టం ద్వారా భూముల రికార్డుల్లో తప్పుల సవరణకు అవకాశం కల్పించబడిందన్నారు.

◆ భూమి రిజిస్ట్రేషన్, మ్యూటేషన్‌కు ముందు తప్పనిసరిగా భూమి సర్వేచేసి మ్యాప్ తయారు చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

◆ ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న సాదా బైనామాల పరిష్కారం ఈ చట్టం ద్వారా వేగవంతం కావడంతో పాటు, వారసత్వ భూముల మ్యూటేషన్‌ను గడువులో పూర్తిచేయడం, హక్కుల సంక్రమణను అధికారికంగా నమోదు చేయడం ద్వారా వ్యవస్థ మరింత నిబద్ధతతో పనిచేస్తుందని కలెక్టర్ తెలిపారు.

◆ భూ సమస్యల పరిష్కారానికి రెండంచెల అప్పీల్ వ్యవస్థ రైతులకు న్యాయబద్ధమైన మార్గం కల్పిస్తుందన్నారు.

◆ ఇళ్ల స్థలాలు, ఆబాది, వ్యవసాయేతర భూములకు హక్కుల రికార్డులతో వ్యవస్థను సమగ్రంగా అభివృద్ధి చేయడంతో పాటు, భవిష్యత్తులో పేద రైతులకు ఉచిత న్యాయ సహాయం అందించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

◆ గ్రామ రెవెన్యూ రికార్డుల నిర్వహణను శాస్త్రీయంగా చేస్తూనే, మోసపూరితంగా పొందిన ప్రభుత్వ భూములపై పట్టాలను రద్దు చేసే అధికారం ఈ చట్టం ద్వారా కల్పించబడిందని, భూ భారతి రైతుల సమస్యలకు శాశ్వత పరిష్కారంగా నిలుస్తోందన్నారు.

◆ భూ సమస్యల పరిష్కారానికి ఎంతో వెసులుబాటు కల్పించే భూభారతి చట్టంపై అవగాహనను ఏర్పరచుకోవాలని కలెక్టరు సూచించారు.

◆ ఈనెల 19 నుంచి జిల్లాలో అవగాహన సదస్సులు ఉంటాయని, ఈ సదస్సుల ద్వారా భూభారతి చట్టంపై ప్రజలు, రైతులకు పూర్తి అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. డీఆర్‌ఓ హరిప్రియ, లా ఆఫీసర్ చంద్రావతి, ఆర్డీఓలు ఉపేందర్‌రెడ్డి, శ్యామ్‌ప్రకాష్, డిప్యూటీ కలెక్టర్ వంశీమోహన్, తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికులకు వేతనాలు చెల్లించాలని..

మేడ్చల్ కలెక్టరేట్ ఎదుట ధర్నా



ధర్నా చేస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులు

సాక్షి, సిటీబ్యూరో: పెండింగ్‌లో ఉన్న 5 నెలల వేతనాలు చెల్లించాలని మేడ్చల్ కలెక్టరేట్ ఎదుట గ్రామపంచాయతీ కార్మికులు ధర్నా నిర్వహించారు. గురువారం తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) ఉపాధ్యక్షుడు ఎన్. శ్రీనివాస్ మాట్లాడుతూ.. మేడ్చల్, షామీర్‌పేట్, మూడుచింతపల్లి, మండలాల్లోని గ్రామపంచాయతీ కార్మికులకు బకాయి ఉన్న 5 నెలల జీతం వెంటనే ఇవ్వాలని కోరారు. రోజువారీ ఖర్చులకు స్కూల్ ఫీజు ఇంటి అద్దె, నిత్యావసరాల సరుకులకు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. సీఐటీయూ జిల్లా కోశాధికారి ఉన్ని కృష్ణ, గ్రామపంచాయతీ కార్మిక నాయకులు సుధాకర్, ప్రశాంత్, శ్రీనివాస్, కృష్ణ, రాములమ్మ గ్రామపంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వైద్య పరికరాల అందజేత



సాక్షి, సిటీబ్యూరో : సీఎస్ఆర్‌లో భాగంగా చెన్నైలోని కెరీర్ ట్రీ హెచ్‌ఆర్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ , హైదరాబాద్‌లోని యునైటెడ్ స్టేట్స్ ఫార్మకోపియా (యూఎస్పీ) సహకారంతో మేడ్చల్ జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో డెలివరీ బెడ్లు, బేబీ వార్మర్లు, బయోకెమిస్ట్రీ ఎనలైజర్లు, సెల్ కౌంటర్ మెషిన్లు, వైద్య పరికరాలను అందజేశారు. ఈ మేరకు గురువారం మేడ్చల్ కలెక్టరేట్‌లో జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డా. ఉమాగౌరీకి ఈ వైద్య పరికరాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కెరీర్ ట్రీ హెచ్‌ఆర్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్, యునైటెడ్ స్టేట్స్ ఫార్మకోపియా (యూఎస్పీ) బృందంతో పాటు అదనపు జిల్లా వైద్యాధికారి డా.సత్యవతి, సూపరింటెండెంట్ మహమ్మద్ సలీం, ఎన్‌హెచ్‌ఎమ్ జిల్లా ప్రోగ్రామ్ అధికారి మంజుల రాజేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు కదలాలి

• కార్పొరేటర్ సబిహా బేగం

మోతీనగర్: వరంగల్‌లో ఈ నెల 27న నిర్వహించే బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు పెద్ద ఎత్తున కదలాలని కార్పొరేటర్ సబిహాబేగం అన్నారు. అల్లాపూర్ డివిజన్ పరిధిలోని గాయత్రినగర్‌లో బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. అనంతరం వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు లింగాల ఐలయ్య, కో ఆర్డినేటర్ వీరారెడ్డి, ప్రధాన కార్యదర్శి పిల్లి తిరుపతి, నాగుల సత్యం, జాహేద్ షరీఫ్ బాబా, కృష్ణారావు, జ్ఞానేశ్వర్, బొల్లు శ్రీనివాసరావు, జావీదుద్దీన్, కొండం శ్రీనివాస్‌రెడ్డి, సంజీవరెడ్డి, బ్రహ్మ, విష్ణు, నాయకులు, పార్వతమ్మ, తదితరులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ సబిహాబేగం, బీఆర్‌ఎస్ నాయకులు

సభను జయప్రదం చేయాలి

బాలానగర్: వరంగల్‌లో నిర్వహించే బీఆర్‌ఎస్ రజతోత్సవ సభను జయప్రదం చేయాలని కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి అన్నారు. గురువారం వినాయక్ నగర్‌లోని ఆయన నివాసం వద్ద సన్నాహక సమావేశం ఏర్పాటు చేశారు. డివిజన్ నుంచి పెద్ద ఎత్తున బీఆర్‌ఎస్ శ్రేణులు కదలాలన్నారు.

కూకట్‌పల్లి: కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహాసభకు కూకట్‌పల్లి డివిజన్‌లోని పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరవ్వాలన్నారు. కార్యక్రమంలో భీమ్‌నేని సంతోష్, లక్ష్మీ నారాయణ, చేగూరి ప్రభాకర్, నాయినేని అభిలాష్‌రావు, బొట్టు విష్ణు, మేకల నర్సింగ్‌రావు, స్వప్నారెడ్డి, లీలా, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ తదితరులు

20న మియాపూర్ రన్

గచ్చిబౌలి: తెలంగాణ రన్నర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మియాపూర్ రన్ 2వ ఎడిషన్ ఏప్రిల్ 20 నిర్వహించనున్నారు. మియాపూర్ లింక్ రోడ్డులో 10కే, 5కే, 5కే ఫన్ రన్‌లను నిర్వహిస్తారు. ఆదివారం ఉదయం 6 గంటలకు రన్ ప్రారంభమవుతుంది. ఫన్ రన్ కోసం రూ. 300, 5కే రన్ కోసం రూ. 500, 10కే రన్ కోసం రూ. 700 చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. వికలాంగులైన చిన్నారుల కోసం ఫండ్ రైజింగ్ నిమిత్తం ఈవెంట్ నిర్వహిస్తున్నామన్నారు. వివరాలకు ఫోన్స్: 83675 81378, 98494 93010లలో సంప్రదించవచ్చు.

పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ లోగో ఆవిష్కరణ



ఓల్డ్ బోయిన్‌పల్లి: తెలంగాణ పవర్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్ 2025 పోటీలకు ఏర్పాటు చేస్తున్నట్లు పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రమేష్‌గౌడ్ అన్నారు. గురువారం ఓల్డ్ బోయిన్‌పల్లిలో పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ లోగోను కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వచ్చే నెల 3, 4 తేదీల్లో స్వర్గీయ బాల్‌రాజు యాదవ్ స్మరకార్థం భాగ్యశ్రీ గార్డెన్‌లో నిర్వహించే పోటీలలో సబ్ జూనియర్, జూనియర్, సీనియర్, మాస్టర్స్ పాల్గొననున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రతినిధులు రమేష్‌బాబు, రవిసింగ్, శేషుయాదవ్, అనిల్‌యాదవ్, పవర్ లిఫ్టర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆదరణ ఫౌండేషన్ సేవలు అభినందనీయం

• కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ



కార్యక్రమంలో పాల్గొన్న సర్వే సత్యనారాయణ, బాబుమోహన్ తదితరులు

కూకట్‌పల్లి: ఆదరణ ఫౌండేషన్ సేవలు అభినందనీయమని కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ అన్నారు. ఆదరణ ఫౌండేషన్ 22వ వార్షికోత్సవం జేఎన్‌టీయూ ఆడిటోరియంలో గురువారం జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాడారు. 22 సంవత్సరాలుగా ఆదరణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుపేదలకు నిస్వార్థంగా సేవలందిస్తూ ఇతర స్వచ్ఛంద సంస్థలకు దిక్సూచిలా ఉండటంహర్షణీయమన్నారు. అనంతరం మాజీ మంత్రి బాబుమోహన్ మాట్లాడుతూ.. ఆదరణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలు, సామాజిక చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తూ ముందుకు సాగటం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో ఆదరణ ఫౌండేషన్ అధ్యక్షులు అరిగెల రఘునాథ్ బాబు, భగవాన్ స్వచ్ఛంద సంస్థ అధినేత పీఎస్‌ఆర్‌కే భగవాన్, ఐఆర్‌ఎస్ అధికారి రైల్వే డైరెక్టర్ సంజీవరావు, డాక్టర్ చిన్నబాబు, డాక్టర్ మార రమేష్, డాక్టర్ యోబు, సినీనటి శివపార్వతి, కాంగ్రెస్ నాయకులు శేరి సతీష్ రెడ్డి, సాధు ప్రతాప్‌రెడ్డి, మేకల మైఖేల్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలి

• కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్

ఓల్డ్ బోయిన్‌పల్లి: డివిజన్‌లో నెలకొన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా అధికారులు కృషి చేయాలని కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ అన్నారు. గురువారం డివిజన్ పరిధి భవానీ నగర్‌లోని శ్రీ దుర్గ భవానీ మాత ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అధికారులతో కలిసి పర్యటించారు. మంచినీటి పైపులైన్, మ్యాన్‌హోల్ కవర్స్, సీసీ రోడ్డు, విద్యుత్ తీగలకు అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించాలని, వీధి దీపాల మరమ్మతులు తదితర సమస్యలను కాలనీ వాసులు కార్పొరేటర్‌కు వివరించారు. అధికారులతో కార్పొరేటర్ మాట్లాడి ప్రజా సమస్యలను పరిష్కరించాలని అన్నారు. కార్యక్రమంలో వాటర్ వర్క్స్ మేనేజర్ తేజ, జీహెచ్‌ఎంసీ ఏఈ ఆశ, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్, ఓంప్రకాశ్, రమేష్, శ్రీనివాస్, సంపత్, కృష్ణ, కాలనీ వాసులు సాయిలు, ఉదయ్, వెంకటేశ్, సుందర్, శేఖర్, ఈశ్వరమ్మ, సునంద, రమేష్, అంజన్న పాల్గొన్నారు.



సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచిస్తున్న కార్పొరేటర్

రాజకీయంగా ఎదుర్కోలేకనే కేంద్రం కుట్ర

• మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్



నిరసనకు వెళ్తున్న కాంగ్రెస్ శ్రేణులు

కుత్బుల్లాపూర్: రాజకీయంగా కాంగ్రెస్ పార్టీని ఎదుర్కొనే దమ్ములేకనే అగ్ర నాయకులపై కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నిందని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ సీనియర్ నేత కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. నేషనల్ హెరాల్డ్ పత్రిక అంశంలో సోనియా గాంధీ, రాహుల్ గాంధీల పేర్లను ఈడీ చార్జిషీట్‌లో చేర్చడాన్ని నిరసిస్తూ గురువారం శ్రీశైలంగౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణుల ఆందోళనకు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువనేత రాహుల్‌గాంధీకి దేశ వ్యాప్తంగా పెరుగుతున్న ఆదరణను చూసి బీజేపీ భయపడుతోందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ విలువలను పక్కనపెట్టి, ప్రజా సంక్షేమాన్ని మర్చిపోయిందని, రాజ్యాంగ సంస్థలను ఉపయోగించి ప్రతిపక్ష పార్టీలపై కేసులు పెట్టే పనిలో ఉందన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ బొంగునూరి శ్రీనివాసరెడ్డి, జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ బొంగునూరి ప్రభాకర్ రెడ్డి, నిజాంపేట్ మాజీ కార్పొరేటర్ ఏనుగుల శ్రీనివాస రెడ్డి, మాజీ కౌన్సిలర్ రాముగౌడ్, కుత్బుల్లాపూర్ యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ మనీష్‌యాదవ్, మైనార్టీ నాయకులు రషీద్ బేగ్, కాంగ్రెస్ నాయకులు బుచ్చిరెడ్డి, మాజీ కౌన్సిలర్ జయరామ్, బైరి శివ కుమార్‌గౌడ్, డప్పు నరేందర్, ఏనుగులు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

26న శాంతి ర్యాలీ

ఆల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గాల సేవకులు, సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 26న ఉదయం 7 గంటలకు శాంతి ర్యాలీ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పాస్టర్ ప్రవీణ్ పగడాల మరణం విషయంలో నిజానిజాలు నిగ్గు తేల్చడానికి సమగ్ర విచారణను సబీఐ ద్వారా జరిపించాలని నిరసన తెలియజేస్తున్నట్లు తెలిపారు. మియాపూర్ క్రాస్ రోడ్డు నుంచి కూకట్‌పల్లి మెట్రో గ్రౌండ్స్ వరకు ర్యాలీ కొనసాగనుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతంచేయాలని కోరారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

• వివిధ కోణాల్లో దర్యాప్తు చేస్తున్న పోలీసులు



లక్ష్మి(ఫైల్)

మూసాపేట: తప్పిపోయిన ఓ మహిళ అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం... మూసాపేట చిత్తారమ్మ నగర్‌కు చెందిన గురజాల లక్ష్మి(63) ఆయాగా పని చేస్తుంది. భర్త గురజాల బాలరాజు 8 నెలల కిందట మృతి చెందాడు. పిల్లలు లేరు. తన భర్త ఇంకో భార్య కొడుకే ఈమె బాగోగులు చూసుకుంటున్నాడు. ఈ నెల 7వ తేదీన నల్లగొండలోని పుట్టింటికి వెళ్లింది. కల్లు తాగే అలవాటు ఉన్న ఆమె పిచ్చి పిచ్చిగా చేస్తుండటంతో ఈ నెల 11వ తేదీన ఆమెను మూసాపేట చిత్తారమ్మ నగర్‌లో వదిలి వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో అర గంటలోనే ఆమె బయటకు వెళ్లింది. అనంతరం కుటుంబ సభ్యులు ఇంటికి వచ్చి చూడగా లక్ష్మి కనబడలేదు. ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో ఈ నెల 12న కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదు చేశారు. గురువారం మూసాపేట గూడ్స్ షెడ్ రోడ్డులో ఎవరో చనిపోయి ఉన్నారని, దుర్వాసన వస్తుందని జ్యూస్ బండి అతను పోలీసులకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు అక్కడికి వెళ్లి స్థలాన్ని పరిశీలించారు. మనిషి వెళ్లలేని ప్రదేశంలో శరీరంపై బట్టలు లేకుండా ఓ మహిళ మృతదేహం లభించింది. స్థానికుల సహాయంతో మృతురాలి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. రెండు రోజుల క్రితం చనిపోయి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. కల్లు దొరక్క పిచ్చితో చనిపోయిందా? మనుషులు వెళ్లలేని ప్రదేశంలోకి ఆమె ఎలా వెళ్లింది?, శరీరంపై బట్టలు లేకపోవడంతో పోలీసులు వివిధ కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం జరిగితే పూర్తి వివరాలు తెలుస్తాయని కూకట్‌పల్లి ఇన్‌స్పెక్టర్ రాజేష్ తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆవిష్కరణలకు ‘ఏఎన్‌ఆర్‌ఎఫ్–పీఏఐఆర్ గ్రాంట్’

• ఆరోగ్యం, వైద్యం, సాంకేతికతల్లో పరిశోధన
• హెచ్‌సీయూ బృందాన్ని అభినందించిన వీసీ బీజే రావు



వీసీ బీజే రావును కలిసిన పలువురు ప్రొఫెసర్లు, ఫ్యాకల్టీ ప్రతినిధులు

రాయదుర్గం: హైదరాబాద్ విశ్వవిద్యాలయంలోని బృందానికి ఆరోగ్యం, వైద్య సాంకేతిక పరిజ్ఞానాలలో పరిశోధన, ఆవిష్కరణలకు ప్రతిష్టాత్మకమైన ఏఎన్‌ఆర్‌ఎఫ్–పీఏఐఆర్ గ్రాంట్ లభించింది. దేశ వ్యాప్తంగా ఉన్న ఏడు అనుసంధాన్ నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్-పార్టనర్‌షిప్స్ ఫర్ యాక్సిలరేటెడ్ ఇన్నోవేషన్ అండ్ రీసెర్చ్(ఏఎన్‌ఆర్‌ఎఫ్–పీఏఐఆర్) ప్రాజెక్టులలో ఒకటిగా ఎంపిక కావడం ద్వారా ఒక ముఖ్యమైన మైలురాయిని సాధించింది. ఈ విజయం లోతైన సామాజిక ప్రభావంతో అత్యాధునిక, సహకార పరిశోధనలను పెంపొందించడంలో హెచ్‌సీయూ నాయకత్వాన్ని ప్రతిబింబిస్తుంది. ఏఎన్‌ఆర్‌ఎఫ్ నుంచి ఈ ప్రతిష్టాత్మక గుర్తింపు బహుళ విభాగ పరిశోధన, ఆవిష్కరణ, నాయకత్వ ప్రాతలలో హెచ్‌సీయూ అచంచలమైన నిబద్ధత, శ్రేష్టతకు నిదర్శనాన్ని నొక్కి చెబుతుంది. హెచ్‌సీయూ ప్రాజెక్ట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బ్రహ్మానందం మానవతి, కో ప్రాజెక్ట్ డైరెక్టర్ ప్రొఫెసర్ సిబాకుమార్ ఉద్గాట, డైరెక్టర్ ఆర్ అండ్‌డీ సెల్ ప్రొఫెసర్ సామ్రాట్ ఎల్ సబత్ ఈ ప్రాజెక్ట్ విజయవంతమైన అమలు కోసం స్పోక్ ఇన్‌స్టిట్యూట్‌లతో సమన్వయం చేసుకుంటారు. ఈ గుర్తింపు ఇంటర్ డిసిప్లినరీ పరిశోధన, ఆవిష్కరణలలో జాతీయ నాయకుడిగా హెచ్‌సీయూ స్థానాన్ని మరింత సుస్థిరం చేస్తుంది. ముఖ్యంగా పలు విశ్వవిద్యాలయాలు, సంస్థలతో కలసి పనిచేయడానికి, జీవక్రియ వ్యాధులు, అంటు వ్యాధులు, కేన్సర్ల కోసం వాస్తవ ప్రపంచ ఆరోగ్య సంరక్షణ పరిష్కారాలను అందిస్తుంది. ప్రత్యేకంగా డయాబెటిస్, ఫ్యాటీలివర్ డిసీజ్, డెంగీ, మలేరియా, బ్రెస్ట్ కేన్సర్, బ్లడ్ కేన్సర్‌లను లక్ష్యంగా చేసుకుంది.

హెచ్‌సీయూ మొత్తం క్లస్టర్‌కు గర్వకారణం

హెచ్‌సీయూకే కాకుండా మొత్తం క్లస్టర్‌కు గర్వకారణమైన క్షణమని హెచ్‌సీయూ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజే రావు స్పష్టం చేశారు. గురువారం ఈ ప్రాజెక్టు సాధనలో కీలకపాత్ర వహించిన పలువురు ప్రొఫెసర్లు, ఫ్యాకల్టీ ప్రతినిధులు వైస్ చాన్స్‌లర్‌ను కలిశారు. ఈ సందర్భంగా వారిని ఆయన అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... మా పరిశోధనా పర్యావరణ వ్యవస్థ యొక్క బలానికి నిదర్శన మన్నారు. ఈ ప్రాజెక్ట్ ప్రపంచ ప్రాముఖ్యతతో జాతీయ ప్రాధాన్యతలను పరిష్కరించడానికి సైన్స్, ఆవిష్కరణలను ఉపయోగించుకునే మా లక్ష్యంతో సంపూర్ణంగా సరిపోతుం దన్నారు. ఇవన్నీ కలిసి పనిచేయడం అనే మిషన్ మోడ్ లక్ష్యంతో ఉన్నాయన్నారు.